ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05.12.2024 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రూపొందించిన యాప్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం లాంఛనంగా ప్రారంభించారు.
2. రెండు పడక గదుల లబ్దిదారులకు గృహ పత్రాలను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ లో పంపిణీ చేశారు.
3. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్ తెలిపారు.
4. మాజీ మంత్రి, BRS ఎమ్మెల్యే హరీశ్ రావును అరెస్టు చేయవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

-------------------

**ఇందిరమ్మ ఇళ్లు యాప్**

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రూపొందించిన యాప్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంధర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇల్లు, వ్యసాయ భూమిని ప్రజలు

ఆత్మగౌరవంగా భావిస్తారని, దశాబ్దాల క్రితమే ఇందిరాగాంధీ ఇళ్లు, భూపంపిణీ పథకాలను ప్రారంభించారని అన్నారు. 10 వేల రూపాయలతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం నేడు 5 లక్షల రూపాయలకు చేరుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని, అర్హులైన వారికే ప్రభుత్వ ఇల్లు దక్కాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తొలి దశలో నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు.

మొబైల్ యాప్ ద్వారా రేపటి నుంచి లబ్ధిదారుల నమోదు చేయనున్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్ ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3 వేల500 నుంచి 4 వేల ఇళ్లను మంజూరు చేస్తారు. ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్లకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపిక చేస్తారు.

**DESK**

---------------------------

**డబుల్ బెడ్రూం ఇళ్లు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పార్టీలకతీతంగా పేదలందరికీ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ఈ రోజు హైదరాబాద్ కలెక్టరేట్ లో జూబ్లీహిల్స్, ముషీరాబాద్ నియోజకవర్గాలలకు చెందిన 81 మంది లబ్ధిదారులకు మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ రెండు పడక

గదుల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రతి గ్రామానికి వచ్చి అధికారులు అర్హుల వివరాలను సేకరిస్తారని ఎలాంటి అవకతవకలు లేకుండా ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు.

హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో మురికివాడల్లో నివసించే వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి అన్ని రకాల చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, నగర మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

**DESK**

----------------------------

**మహిళా శక్తి క్యాంటీన్లు**

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్ ను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమని, వారికి రుణాలు అందించి ప్రోత్సహిస్తామని మంత్రి తెలిపారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం మంత్రి క్యాంటీన్లో ఏర్పాటు చేసిన పిండి వంటలు, ఇతర ఆహార పదార్థాలు, బిర్యానీ స్టాల్స్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, మాధురి, RDO రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి పీటీసీ**

-------------------------

**మంత్రి కోమటిరెడ్డి**

నల్లగొండ జిల్లా నార్కట్పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ రోజు పరిశీలించారు. ఎల్లుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, పైలాన్ ను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నారు.

**పిటిసి, నల్లగొండ జిల్లా**

----------------------------

**మహిళా శక్తి బజార్**

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తుల విక్రయాల కోసం రాజధాని హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి మహిళాశక్తి బజార్‌ను ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్లలో విక్రయిస్తున్నారు. వారి కోసం శాశ్వత విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శిల్పారామంలో 9 కోట్ల

రూపాయలతో మహిళాశక్తి బజార్‌కు రూపకల్పన చేసింది. మహిళా సంఘాలు తయారుచేసే ఉత్పత్తులతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాలు, ఆహార స్టాళ్లను ఈ బజార్లో ఏర్పాటు చేశారు.

**DESK**

---------------------------

**అసెంబ్లీ సమావేశాలు**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఈ నెల 9వ తేదీ నుంచి జరుగుతాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిన్న నోటిఫికేషన్ జారీ చేశారు. సోమవారం ఉదయం పదిన్నర గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తోన్న నేపథ్యంలో అసెంబ్లీ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**DESK**

---------------------------

**పాడి కౌశిక్ రెడ్డి**

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో బుధవారం పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఫిర్యాదు మేరకు BRS ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఈ రోజు పోలీసులు అరెస్టు చేశారు. కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు 20 మందిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఈరోజు హైదరాబాద్ లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద ఆయన్ను అరెస్ట్ చేసి బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అంతకుముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున

బీఆర్ఎస్ కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి వెళ్లేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. హరీశ్‌ను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు యత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**DESK**

-----------------------

**హరీష్ రావు**

మాజీ మంత్రి, BRS ఎమ్మెల్యే హరీశ్ రావును అరెస్టు చేయవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తనపై రాజకీయ కక్ష్యతో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదును కొట్టివేయాలని కోరుతూ హరీశ్ రావు నిన్న హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు విచారించిన హైకోర్టు ఆయన్ను అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. నోటీసులు ఇచ్చి తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని పేర్కొంది. దీనికి హరీశ్‌రావు సహకరించాలని సూచించింది. ఆయనపై ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

**DESK**

--------------------------

**ప్రజాపాలన దినోత్సవాలు**

RTC ని లాభాలలో నడుపుతున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం

ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని ఆర్టీసి బస్సు డిపో ప్రాంగణం లో ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక కార్యాచరణ తో నూతన సంస్కరణలు చేపట్టి... ఆర్టీసీ ని లాభాల బాట పట్టించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు.

**మహబూబాబాద్ జిల్లా, పి టి సి**

-------------------------

**బీసీ వసతి గృహం**

విద్యార్థులు తమ దినచర్యలో వ్యాయామం క్రీడలను భాగం చేసుకోవాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. ఈ రోజు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ వసతిగృహ విద్యార్థుల జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో బీసి వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్, పరుగు పందెం పోటీల్లో పాల్గొంటున్నారు.

**పీటీసీ వనపర్తి**

----------------

**సీఎం కప్**

క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

పేర్కొన్నారు.  ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా జిల్లాలో ఈ నెల 7 నుంచి జనవరి 2 వరకు సీఎం కప్-2024 పోటీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, తైక్వాండో,  కరాటే,  పవర్ లిఫ్టింగ్, చెస్, ఉషు తదితర పోటీలను నిర్వహించాలన్నారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

----------------------------